## క్లుప్తంగా

### పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా జిల్లేడు ఆకు కషాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

**పార్వతీపురంటౌన్:** పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా జిల్లేడు ఆకు కషాయం ఉపయోగించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మండలంలోని గోచెక్క గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా జిల్లేడు ఆకు కషాయం, దోమపోటు నివారణకు తూటికాడ కషాయం ఉపయోగాలను గ్రామంలోని ప్రతి ఒక్క రైతుకు వివరించారు. దేశీ విత్తనాలను ప్రోత్సహించాలని ప్రతి ఒక్క రైతు దేశీ విత్తనాలను వేయాలని, వాటిలో అధిక పోషక విలువలు ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



నిరుపేదలకు వితరణ అందిస్తున్న దాతలు

**బలిజిపేట:** మండలంలోని పెదపెంకి గ్రామంలో గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు మాస్టారు వర్ధంతి సందర్భంగా 12మంది నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేసినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తెలిపారు. అదేవిధంగా స్నేహ చైత్ర ఫౌండేషన్ తరఫున ఒక నిరుపేదకు రూ.2వేలు అందజేశారు. నిరుపేదలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందించాలని సంజీవనాయుడు యువతను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సీహెచ్.అప్పలనాయుడు, జి.సంజీవినాయుడు, వి.శివుడునాయుడు పాల్గొన్నారు.

### పోలమాంబకు గాజుల అలంకరణ



పసుపు కొమ్ములు, గాజులతో దర్శనమిస్తున్న అమ్మవారు

**మక్కువ:** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని సోమవారం పసుపు కొమ్ములు, గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద హోమం నిర్వహించారు.

### 80 మందికి నేత్ర పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న మిమ్స్ వైద్యాధికారి నవీన్‌కుమార్

**మక్కువ:** మండలంలోని శంబర గ్రామంలో సామాజిక కార్యకర్త మాస్ బాలుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 80 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిమ్స్ వైద్యాధికారి నవీన్‌కుమార్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అవసరమైన వారికి మిమ్స్‌లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.

### తాళ్లబురిడిలో పూడిక తీత



కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

**పార్వతీపురంటౌన్:** మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో సర్పంచ్ బలగ రేవతమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, పూడిక తీత సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగారావు ఆదేశాల మేరకు గ్రామంలో గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో పట్టణం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- 29వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

**పార్వతీపురంటౌన్:** పట్టణాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పురపాలక సంఘం పరిధిలో గల 29వ వార్డు కుసుమ గుడ్డి వీధిలో స్థానిక ప్రజల కోరిక మేరకు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన వార్డు ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ చకచకా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో ప్రారంభించి పూర్తి చేయించనున్నట్లు చెప్పారు. గతంలో మీకు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామని మీరంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు యడ్ల త్రినాథ రావు, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవ్, కౌన్సిలర్‌లు అర్.చిన్నంనాయుడు, అర్ బంగారి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సచివాలయ భవనాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి

**సీతానగరం:** మండలంలోని గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయ భవనాలను త్వరగా పూర్తిచేసి ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన భవన నిర్మాణాలు ఎన్ని పూర్తయ్యాయి? ఎన్ని అసంపూర్తిగా ఉన్నాయనే? అంశాలపై మండలపరిషత్ కార్యాలయంలో ఏఓ, ఈఓపీఆర్డీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక అధికారి సూచనల మేరకు మండలంలో జరుగుతున్న సచివాలయాల భవనాలు, రైతు భరోసా భవనాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, డిజిటల్ లైబ్రరీలు నిర్వాహకులతో పూర్తి చేయించడానికి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**నేడు దయానిధిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష**

మండలంలోని దయానిధిపురం సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు మంగళవారం దయానిధిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం పెందంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీడీఓ తెలియజేశారు. దయానిధిపురంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో నిర్వహించనున్న ఉచితవైద్య శిబిరాన్ని జయంతిరాయపురం, దయానిధిపురం, జానుమల్లువలస గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజ



సామూహిక కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



ఆదిలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

**పార్వతీపురంటౌన్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పార్వతీపురంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ చేశారు. ఏటా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు ఒక్కో రూపంలో దర్శనమిస్తారని చెప్పారు. రెండోరోజు అమ్మవారు గాయత్రి మాతగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్తా నాగేశ్వరరావు, పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఐ. గున్నేశ్వరరావు, పూసర్ల చిన్ని కృష్ణ, ఇంకులు గాంధీ, ఉషా ఫౌండేషన్ అధినేత ఐ. ఉషారాణి, కందుకూరి లక్ష్మి, వరదాగాయత్రి పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను మర్యాదపూర్వకంగా కలిసిన ఏడీఏ రంగారావు

**సాలూరు:** ప్రజలు, రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. విద్యుత్ శాఖ సాలూరు ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన రంగారావు మంత్రి రాజన్నదొరను సోమవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, మక్కువలో నూతన ఏఈని నియమించాలని కోరారు. సాలూరు మున్సిపాలిటీ, మండలంలో సుమారు 33 వేల సర్వీస్‌లున్నా ఒకే సెక్షన్‌గా ఉందన్నారు. మున్సిపాలిటీ, మండలాన్ని రెండు సెక్షన్‌లుగా విడదీసి, ఇద్దరు ఏఈలు పర్యవేక్షించేలా సీఎండీకి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రాములు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

### గిరిజనులకు పోడు పట్టాలివ్వండి

**పార్వతీపురం:** గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌కు గిరిజన సంఘాల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.సురేష్, జె.బంగారు రాజు, పి.శ్రీరాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గిరిని అభినందిస్తున్న కోచ్

**కురుపాం:** స్థానిక మహాలక్ష్మీ ఒకేషనల్ కళాశాల విద్యార్థి పువ్వల గిరి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కె.నరేష్, జిల గోపాల్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్-19 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. విద్యార్థిని కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

### వాహనాల దారి మళ్లింపు

**పాలకొండ రూరల్:** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విశాఖ, పార్వతీపురం మీదుగా వచ్చే వాహనాలను అన్నవరం గ్రామం మీదుగా పాలకొండ పట్టణంలోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రహదారిపై గుంతలను సోమవారం యుద్ధప్రాతిపదికన పూడ్చివేశారు. వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశేశ్వరరావు, అన్నవరం సర్పంచ్ గవర రాజశేఖర్, పీఆర్ ఈఈ ఎస్.రాధారాణి, డీఈఈ దారపు లోకనాథం, ఏఈ కిరణ్‌కుమార్ పనులను పర్యవేక్షించారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న రహదారి సమస్య పరిష్కారం కావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రణాళికల ఆధారంగా ఉపాధి పనులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ భాను

**సీతానగరం:** మండలంలోని రంగంపేట పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వేతన దారులకు పని కల్పిస్తూ గిట్టుబాటు వేతనం అందజేయడానికి గ్రామసభల ద్వారా ప్రజామోదం పొందుతున్నట్లు ఎన్ఆర్‌ఈజీఎస్ మండల ఏపీఓ భాను చెప్పారు. ఈ మేరకు సోమవారం రంగంపేటలో క్షేత్ర సహాయకుడు పి.తిరుపతిరావు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉపాధిపనులు గుర్తించడానికి ప్రజామోదం కోసం రామమందిరంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రంగంపేటలో ఉపాధి వేతనదారులకు పనులు కల్పించడానికి రూ.1 కోటీ 27 లక్షల వ్యయంతో 96 పనులను గుర్తించామని చెప్పారు. ప్రధానంగా చెరువులు, కాలువలు, మట్టి రోడ్లు, తోటల పెంపకం తదితర పనులు కల్పించడానికి ప్రజలనుంచి ఆమోదం పొందినట్లు తెలియజేశారు. గ్రామంలో జాబ్ కార్డులు పొందిన వారందరికీ పనులు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, శ్రమశక్తి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## వైద్యశిబిరం విజయవంతం



సాలూరు: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

**సాలూరు:** మండలంలోని కరాసవలసలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 563 మంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మాట్లాడుతూ, ప్రజల చెంతకు వైద్యం తీసుకువచ్చిన మహానుభావుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి...**

**పాచిపెంట:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని రాయి గుడ్డివలస సచివాలయం పరిధిలో స్థానిక సర్పంచ్ చింత సీతయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా ఓ వైపు ఆదుకుంటూ, మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరనాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు డోనేరు సీతమ్మ, గుమ్మడిగూడ సర్పంచ్ బుచ్చిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు డోనేరు లచ్చయ్య, కునుకు సత్యనారాయణ, వైద్యాధికారులు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాచిపెంట: జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాలనాయుడు, ప్రజా ప్రతినిధులు

## గిరిజన స్పందనకు 49 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

**సీతంపేట:** ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 49 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని సొంటినూరుకు చెందిన చిన్నమి, టెంట్‌హౌస్ ఇప్పించాలని వడమసాయికి చెందిన మోహనబాబు, కుట్టుమిషన్ ఇప్పించాలని వలగజ్జికి చెందిన ఉమాదేవి అధికారులను కోరారు. వైద్యుత్ లైన్ మార్చాలని కింద్రువాడకు చెందిన సవర రామారావు, సీసీ రోడ్డు మంజూరు చేయాలని మర్రిమానుగూడ గ్రామస్తులు త్రినాథరావు, మేకలు, గొర్రెల కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని మందసకు చెందిన సవర రాజు వినతిపత్రాలు అందజేశారు. తమ గ్రామం వద్ద వంతెన నిర్మించాలని బర్న గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, పీఏఓ హరికృష్ణ, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి పాల్గొన్నారు.

## ఆహార భద్రతపై అవగాహన

**కురుపాం:** ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామంలో యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీసెస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో సోమవారం ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 29 రకాల ఆహార ధాన్యాలు, పండ్లు, దుంపలు, వివిధ రకాల కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. రసాయనతో కూడిన కలుషిత ఆహార పదార్థాలు తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పువ్వల అజ్జారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి తదతరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను నియంత్రించాలి



బలిజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల సమాఖ్య

**బలిజిపేట:**

బాల్య వివాహ రహిత భారతదేశం అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపుమేరకు బలిజిపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో బలిజిపేటలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించే విధంగా అందరం పాటుపడాలని, గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను, అనర్థాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామ సంఘాల్లో దీనిపై అందరికీ అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. అన్ని వర్గాలవారికి తెలియపరిచి ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా నియంత్రించాలని మహిళలకు సూచించారు. దీనిపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా గ్రామాల్లో చేయించాలని మహిళా సంఘాలను కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

**బాల్య వివాహ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం**

**సీతానగరం:** బాల్యవివాహ రహిత సమాజ స్థాపన ప్రజల సహకారంతోనే సాధ్యమని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. బాల్య వివాహ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలకేంద్రంలో వీఓఏలు పొదుపు సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనా రాహిత్యంతో బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే ఇబ్బందులను తెలుసుకుని ప్రజలకు గ్రామాల్లో తెలియజేయాలని పొదుపు సంఘాల మహిళలకు సూచించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. అందుకు వీఓఏలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల, క్లస్టర్ సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.



సీతానగరం: ర్యాలీలో మాట్లాడుతున్న ఏపీఎం ఆర్ శ్రీరాములు



మక్కువ: మార్కొండపుట్టిలో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళామండలి సభ్యులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

**బాల్య వివాహాలు చట్టరీత్యానేరం**

**మక్కువ:** బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని వెలుగు ఏపీఎం సన్నిబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో మహిళా మండలి సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులతో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెర్ప్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో మహిళామండలి సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సాలూరు: నెలిపర్తిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వెలుగు ఏపీఎం సింహాచలం

**బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం**

**సాలూరు:** ఆంధ్రప్రదేశ్‌ను బాల్యవివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి అందరు కృషి చేయాలని వెలుగు ఏపీఎం గండిపల్లి సింహాచలం అన్నారు. వెలుగు కార్యాలయంలో రైతు సంఘాలతో.. నెలిపర్తి, తదితర గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### 19న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ

**పాలకొండ రూరల్:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 98493 16945, 9948066185 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన టీంలకు రూ.8వేలు చొప్పున నగదు అందించనున్నారు.